గ్రీన్‌బెల్ట్ కబ్జా!

- వచ్చని చెట్లపై వేటు
- దర్జాగా ఇంటికి రహదారి నిర్మాణం
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



గ్రీన్‌బెల్ట్‌లో రోడ్డు నిర్మాణం



గ్రీన్ బెల్ట్‌లో చెట్లు తొలగించి నిప్పుపెట్టిన దృశ్యం

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాలపై కూటమి నేతల కన్నుపడింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు దానిలో పాగా వేసేస్తున్నారు. చివరకు గ్రీన్ బెల్ట్‌ను సైతం వదలడం లేదు. కాకానినగర్‌లో హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రస్తుతం కబ్జాకు గురవుతోంది. కూటమి నేతల అండదండలతోనే ఈ తంతంగం సాగుతుండడంతో జీవీఎంసీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎయిర్ట్ పోర్టు నుంచి ఎన్ఏడీ జంక్షన్‌కు వచ్చే దారిలో కాకానినగర్ బస్టాప్ సమీపంలో హైవే పక్కన ఉన్న విలువైన స్థలం ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలోకి పోతుంది. సుమారు 200 గజాలకు పైగా ఉన్న గ్రీన్ బెల్ట్ స్థలాన్ని వశం చేసుకునేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు.

నేలకొరిగిన పచ్చని చెట్లు

గ్రీన్ బెల్ట్ పరిరక్షణలో భాగంగా ఆ స్థలానికి జీవీఎంసీ ఆధ్వర్యంలో ఇనుప చువ్వలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఆహ్లాదం పంచేలా జీవీఎంసీ నిధులు వెచ్చించి మొక్కలు పెంచారు. అయితే కాకానినగర్ వద్ద కబ్జా చేసిన స్థలంలో పచ్చని మొక్కలు నరికేసి నిప్పుపెట్టేశారు. దీంతో ఆ ప్రాంగణంలో పచ్చదనం మాయమైంది. గ్రీన్ బెల్ట్‌లోని చెట్లు నరికేసి చెత్త చెదారం తొలగించి నిప్పు పెట్టేంత వరకు జీవీఎంసీ అధికారులకు ఇది కనిపించకపోవడంలో ఆంతర్యమేంటని ఈ ప్రాంత వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రతీ రోజూ అదే ప్రాంతంలో పనిచేసే జీవీఎంసీ అధికారులు, సిబ్బందికి ఇది కనిపించలేదా..? మరేవైనా ఒత్తిళ్ల నేపథ్యంలో కళ్లు ఉండీ కబోదుల్లా మారారా..? అనేది ఉన్నతాధికారులు నిగుతేల్చాల్సి ఉంది.

దర్జాగా రోడ్డు నిర్మాణం

గ్రీన్ బెల్ట్ కబ్జా చేసిన ప్రైవేటు వ్యక్తులు దానిలో రహదారి ఏర్పాటు చేసుకుంటున్నారు. చెట్లు నరికేసి, చెత్త చెదారం తొలగించిన చోట మట్టికుప్పలతో ఎత్తుగా చేస్తున్నారు. ఇక్కడ ఓ రెస్టారెంట్ ఏర్పాటు కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే



గ్రీన్‌బెల్ట్‌లో మాయమైన పచ్చదనం

గ్రీన్‌బెల్ట్‌పై ప్రైవేటు వ్యక్తుల కన్నుపడిందని కాకానినగర్ వాసులు చెబుతున్నారు. వారం రోజులుగా ఈ ఆక్రమణ పర్వం కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మీరైనా పట్టించుకోండి

హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ పరిరక్షణకు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ వీఎంఆర్‌డీ కమిషనర్ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. కబ్జారాయుళ్లకు సహకరిస్తున్న స్థానిక అధికారులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరించి ఇలాంటి ఆగడాలకు చెక్ పెట్టాలని ఈ ప్రాంత వాసులు కోరారు.

క్లుప్తంగా

నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులకు అభినందన



బంగారు పతకం సాధించిన నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులు

సింధియా: శ్రీలంకలో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్ -2024 పోటీల్లో విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్ ఉద్యోగులు తమ ప్రతిభ చూపారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ట్రయిల్ బ్లాజర్ అనే టీమ్‌లో మొత్తం 7 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకం సాధించిన వారిని అధికారులు, మిగిలిన సిబ్బంది అభినందించారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజుయాదవ్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న పలువురు కాంట్రాక్టర్ల వద్ద పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ (వీఐసీఎల్‌యూ)అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ డిమాండ్ చేశారు. నక్కవానిపాలెంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగులకు కాంట్రాక్టర్లు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్‌కాలనీలోని పౌరగ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయాధికారి కనకరాజు ఆధ్వర్యంలోపర్యావరణ పరిరక్షణ, నీటి వనరులు సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వనరులను ఏ విధంగా సంరక్షించుకోవాలనే విధానాలను చక్కగా వివరించారు.

పేదలకు చీరల పంపిణీ

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు శుక్రవారం పేద మహిళలకు చీరలు,పండ్లు పంపిణీ చేశారు.నక్కవానిపాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం ప్రతినిధులు నమ్మి గౌరీశ్వరరావుయాదవ్,బొట్ట చిన్నాయాదవ్ మాట్లాడుతూ దేవర సినిమా 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

53 మందికి ఉద్యోగాలు

విశాఖ విద్య: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ మేళా నిర్వహించారు. ఇంటర్వ్యూలో కళాశాలకు చెందిన బి.టెక్, ఎంసీఏకు చెందిన 53 మంది విద్యార్థులు ఉద్యోగానికి ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పి. ప్రదీప్ వర్మ అభినందించారు.

వ్యర్థాల మాటున ముప్పు!



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం శివారు ప్రాంతంలోని గెడ్డలో భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు ఇక్కడ నిలిచిపోతున్నాయి. దీనికి తోడు ఈ గెడ్డలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడం వల్లే ఈ సమస్య నెలకుంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో క్రిమి కీటకాలు చేరి పలు అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు



మహోత్సవాలకు తరలి వెళ్తున్న యాదవ మహిళా సంఘ ప్రతినిధులు



కృష్ణాలయంలో అభిషేకం చేస్తున్న స్వాములు

మల్కాపురం: కార్తీక పౌర్ణమి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు కృష్ణాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద గల విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి అయ్యప్ప భక్తులు పాలు,పెరుగుతో అభిషేకాలు చేపట్టారు. మహిళలు వాసుదేవుని కీర్తనలు ఆలపించారు.అలాగే శ్రీహరిపురం,పవనపుత్రకాలనీ , ప్రకాష్‌నగర్,నక్కవానిపాలెంలోని కృష్ణాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

రాధాకృష్ణ మహోత్సవాలకు తరలి వెళ్లిన భక్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆర్‌కేబీచ్ వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన రాధాకృష్ణ మహోత్సవాలకు పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు ర్యాలీగా తరలి వెళ్లారు.సంప్రదాయ వస్త్రాలు ధరించి శ్రీకృష్ణుడిని పాలు,పెరుగుతో అభిషేకించేందుకు వెంట తీసుకువెళ్లారు.

సాకేతపురంలో ఫ్రైడే-డ్రైడే

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురం ప్రాంతంలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' పైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త సేకరణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. క్లాప్ వాహనాలకు చెత్త అందించాలని ప్రజలకు సూచించారు. వార్డులోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ప్రజలు జెడ్సీ రాముకు వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీవో కృపానందరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సాకేతికపురంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

మల్కాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ములగాడ ఎంఈవో వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదర్శనను తిలకించారు.ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం ఒక విజ్ఞాన గని అని అన్నారు. విద్యార్థులు టీవీలు, ఫోన్లతో కాలక్షేపం చేయకుండా గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలని సూచించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలని వినతి

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో విద్యార్థులు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సు సర్వీసులు నడపాలని తెలుగు యవత అధ్యక్షుడు గుత్తుల మధుబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయకుమార్, డిపో మేనేజర్ సుధాకర్, జిల్లా ప్రజారవాణాధికారి అప్పలనాయుడును కలిసి వినతి పత్రాలు సమర్పించారు. పాఠశాలు, కళాశాలల వేళల్లో బస్సు సర్వీసులు పెంచాలని కోరారు. బస్సులు సరిపడా లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. కార్యక్రమంలో వెంకటేష్, సత్య, జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

రోడ్డుపై పార్కింగ్‌తో అవస్థలు

విశాఖ విద్య: గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ సెంటర్‌కు వచ్చే బీఆర్టీఎస్ రోడ్డులో దుకాణాలు, పాఠశాలల వద్ద బస్సులు, ఇతర వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేస్తున్నారు. దీని వల్ల ఆ దారిలో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. సాయంత్రం వేళల్లో బీఆర్‌టీఎస్ రోడ్డుపై తీవ్రమైన రద్దీ ఉంటుంది. ఇదే సమయంలో విద్యార్థులను ఇళ్లకు డ్రాప్ చేసేందుకు విద్యాసంస్థల ముందు రోడ్డుపై గంటల తరబడి బస్సులు నిలిపివేస్తున్నారు. నో పార్కింగ్ ఏరియాలు, రోడ్డుపై వాహనాలు నిలిపితే ఫోటో తీసి జరిమానాలు విధించే ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రమాదం చోటుచేసుకున్న తర్వాత హడావుడి చేసేకంటే ముందుగానే ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని కోరుతున్నారు.



రోడ్డుపై నిలిపిన స్కూల్ బస్సు

చదవడం అలవాటుగా మార్చుకోవాలి

విశాఖ విద్య: ప్రతీ ఒక్కరూ చదవడం అనేది ఒక అలవాటుగా మార్చుకోవాలని ఎస్ఐ అప్పలనాయుడు అన్నారు. గోపాలపట్నం శాఖా గ్రంథాలయం లో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన తిలకించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దీర్ఘకాలిక ప్రణాళితో చదవాలని అందుకు గ్రంథాలయాలు అనుకూలమన్నారు. చదవాలనే ఆశ ,జిజ్ఞాస ఉంటే సరిపోదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్న వారు మంచి ఉన్నత స్థితిలో ఉన్నారని.. వారిని ఆదర్శం గా తీసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ అప్పలనాయుడు

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

విశాఖ విద్య: కాలనీలు పరిశుభ్రంగా ఉంచేలా పారిశుధ్య అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. 90వ వార్డు పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ జోన్-8 కమిషనర్ హైమావతి పాల్గొని పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త సేకరణ వాహనాల వినియోగాన్ని ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ అప్పలనాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకినాడ బుచ్చిబాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ రమణ

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

- భక్తి శ్రద్ధలతో జ్వాలాతోరణం
- వేడుకలో పాల్గొన్న భక్తజనం



పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



మర్రిపాలెం వుడాలేఅవుట్ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

విశాఖ విద్య: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఎన్ఏడీ ఏరియాలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫ్లై ఓవర్ సమీపంలోని ప్రమథ ఉమావిశ్వేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

- జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజల్లో భాగంగా సామూహిక దీపాలు వెలిగించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ డి. సూర్యనారాయణ, వైస్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి శంకర రావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష శివ ప్రసాద్, సత్యనారాయణ, రత్నకుమారి, సునీత,గృహేశ్వర్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీలోని పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం వేడుకగా జరిపించారు. సాయంత్రం ఆలయం వద్ద జ్వోలా తోరణం వేడుక అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో పదేళ్లుగా జ్వాలాతోరణం వేడుక నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు నాగేంద్ర ఇచ్చారపు, కార్యదర్శి శ్రీనివాసరాజు తెలిపారు.
- గోపాలపట్నం, నాగేంద్రకాలనీలోని శివాలయాలను భక్తులు అధిక సంఖ్యలోదర్శించుకొని కార్తీక దీపాలు వెలిగించారు.



దీపాల కాంతుల్లో మర్రిపాలెం వినాయకుడి ఆలయం

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

సింధియా: షిప్‌యార్డ్‌కాలనీలోని తులసి ఉత్కల్ సమాజ్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిప్‌యార్డ్‌లోని ఒరియా కటుంబీకులు 24 గంటల పాటు హరే రామ, హరే కృష్ణ అంటూ ఉపవాస దీక్షలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. హిందూస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణ పనులకు వచ్చిన వారు షిప్‌యార్డ్‌కాలనీలో ఉత్కల్ సమాజ్ తులసి మండపం తదితర సంఘాలు ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. దీంతో అప్పటి నుంచి వారసత్వంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. తులసి మండపం అధ్యక్షులు గౌతమ్ చక్రవర్తి పాండ ఆధ్వర్యంలో షిప్‌యార్డ్‌కాలనీలో ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో సుదర్శన్‌చక్రవర్తి, సింహాచలం పాండా, ఒడియా కుటుంబీకులు పాల్గొన్నారు.



దీపాలు పెడుతున్న ఉత్కల్ సమాజ్ సభ్యులు



90వ వార్డు సుసర్లకాలనీ చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద జ్వోలాతోరణం వేడుకలో పాల్గొన్న భక్తులు

పైడిమాంబ ప్రతిమ ధ్వంసం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట పైడిమాంబ ఆలయంలోని ఉత్సవ ప్రతిమను దుండగులు ధ్వంసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రధాన ఆలయం వెనుక ఉన్న ఉత్సవ విగ్రహ చేతులను గుర్తు తెలియని వారు ధ్వంసం చేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మవారి ప్రధాన దేవాలయం వెనుక ఉన్న ఈ ప్రతిమలకు నిత్య పూజలు చేసేవారమని, ప్రతిమలు ధ్వంసం చేయడం దారుణమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు.



దుండగులు ధ్వంసం చేసిన పైడిమాంబ ఉత్సవ విగ్రహం

మల్కాపురం వాసి హైదరాబాద్‌లో మృతి

మృతుడు అమెజాన్ సంస్థలో మేనేజర్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హరిజన వీధికి చెందిన దేవకుమార్ స్వామి(28) గురువారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దేవకుమార్‌స్వామి బీటెక్ పూర్తి చేసి.. హైదరాబాద్‌లోని అమెజాన్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వారం కిందట మల్కాపురం వచ్చాడు. తల్లిదండ్రులు, స్నేహితులతో రెండు రోజులు సరదాగా గడిపి.. మళ్లీ సంక్రాంతికి వస్తానని చెప్పి హైదరాబాద్ వెళ్లాడు. ఇంతలోనే అక్కడ ప్రమాదం జరిగి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అతని తల్లిదండ్రులు హుటాహుటిన హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. విజయవాడ ప్రాంతానికి చెందిన స్నేహితుడితో కలిసి దేవకుమార్ గురువారం సాయంత్రం గచ్చిబౌలి రోడ్డులో ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. వాహనం అదుపు తప్పడంతో దేవకుమార్‌కు తలకు తీవ్ర గాయమై.. అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతను గచ్చిబౌలిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. దేవకుమార్‌స్వామి మృతదేహాన్ని శనివారం మధ్యాహ్నం మల్కాపురం తీసుకురానున్నారు.



దేవకుమార్‌స్వామి(ఫైల్)

సముద్ర గస్తీపై శిక్షణ



మొజాంబికన్ అర్మ్‌డ్ ఫోర్స్‌కు శిక్షణ ఇస్తున్న ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారి

ఎంవీపీకాలనీ: సముద్ర భద్రత కోసం ఐక్య ఫ్రంట్‌లో భాగంగా ఐఎన్ఎస్ ఘరియాల్ అధికారులు మొజాంబికన్ ఆర్మ్‌డ్ ఫోర్స్‌కు ఉమ్మడి గస్తీపై శిక్షణ ఇచ్చారు. మొజాంబిక్‌లోని పోర్ట్ నకాలా నుంచి ఈ నెల 12న ఐఎన్ఎస్ ఘరియాల్ బయలు దేరిన సమయంలో ఈ శిక్షణ జరిగింది. జాయింట్ ఈఈజెడ్ గస్తీ, సముద్ర రైడర్లకు ఎన్‌బీసీడీ, వీబీఎస్ఎస్, ఇంజిన్ అండ్ స్విచ్‌బోర్డ్ నియంత్రణలపైనా మొజాంబికన్ దళాలకు శిక్షణ అందించారు.